


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 37 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శనివారం 12 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 37 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SAT 12 OCTOBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelluru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## చట్టాన్ని ఉల్లంఘించిన బ్యాచ్‌పై యాక్షన్ అనివార్యం

- కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- రాష్ట్రం నుంచి తరలి వెళ్లిన పెట్టుబడులను తిరిగి తీసుకొచ్చే బాధ్యత తీసుకుంటామన్న మంత్రి
- ఏపీకి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అంటూ ప్రశంసలు
- జగన్ జిల్లాల పర్యటనకు వెళితే చట్ట ప్రకారం అనుమతి ఇస్తామని వెల్లడి
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:మంగళగిరి పరిధిలోని కొలనుకొండలో కియా కార్ల షోరూమ్‌ను మంత్రి నారా లోకేశ్ ఇవాళ (శుక్రవారం) ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి, పెట్టుబడుల విషయంలో పక్క రాష్ట్రాలతో ఏపీ పోటీ పడాలని అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టబోమని, పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతామన్న వారందరినీ తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ఆయన చెప్పారు. టీసీఎస్, లులూ,

వివరాలు 2లో..



- ఏపీలో నూతన మద్యం విధానం
- ఈ నెల 14న లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు
- ఈ నెల 15న లైసెన్స్ ల జారీ

## ఏపీలో మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు..

# రూ.1800 కోట్ల ఆదాయం

### ఏపీలో ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ గడువు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాల లైసెన్స్‌లకు సంబంధించి దరఖాస్తు గడువు శుక్రవారం రాత్రి 7గంటలకు ముగిసింది. మద్యం దుకాణాల కోసం దాదాపు 90వేల వరకు దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.1800 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ, రాత్రి 12గంటల్లోపు ధరావత్తు సొమ్ము చెల్లించేందుకు అబ్కారీశాఖ అవకాశం కల్పించింది. అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాల్లో నోటిఫై చేసిన 113 మద్యం దుకాణాలకు 5,700కు పైగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల నుంచి వచ్చిన సమాచారాన్ని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు క్రోడీకరిస్తున్నారు. విదేశాల నుంచి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు దాఖలయ్యాయి. మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు భారీ ఎత్తున సిండికేట్లు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల పెద్దగా దరఖాస్తులు రాకుండా సిండికేట్ రింగ్ అయింది. సీఎం చంద్రబాబు హెచ్చరికతో మద్యం టెండర్ల ఎపిసోడ్ దారిలోకి వచ్చింది. ఈ స్థాయిలో మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు రావడం ఇదే తొలిసారి. అని ఎక్సైజ్‌శాఖ పేర్కొంది. అన్ని రకాల బ్రాండ్లకు చెందిన చీప్ లిక్కర్‌ను రూ.99కే ఎక్సైజ్ శాఖ అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 3,396 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించిన ఎక్సైజ్‌శాఖ ఈ నెల 14న లాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనుంది. అక్టోబరు 15వ తేదీ నాటికి దుకాణాలను లాటరీలో దక్కించుకున్న ప్రైవేటు వారికి అబ్కారీశాఖ అప్పగించనుంది. 16వ తేదీ నుంచి రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి రానుంది.

## తెలుగు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జగన్



- ఏపీ, తెలంగాణ ప్రజలకు జగన్ పండుగ శుభాకాంక్షలు
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ బాగుండాలన్న వైసీపీ అధినేత
- అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరికీ లభించాలని ఆకాంక్ష

వివరాలు 2లో..

## జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి




- జపాన్ సంస్థకు నోబెల్ శాంతి పురస్కారం
- ది నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటన
- నిహాన్ హిడాంక్యోను వరించిన నోబెల్ శాంతి బహుమతి
- అణ్వాయుధాలు లేని ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్న సంస్థ

వివరాలు 2లో..



పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు విజయ దశమి శుభాకాంక్షలు.

**సెలవు**

నేడు(శనివారం) దసరా పండుగ సందర్భంగా పెన్ పవర్ కార్యాలయానికి సెలవు కావున పత్రిక పునర్దర్శనం 14.10.2024

## విజయవాడలో రైతు బజార్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల

- గురునానక్ కాలనీ, పంట కాలువ రోడ్ లో రైతు బజార్లను సందర్శించిన నాదెండ్ల
- నాణ్యతలేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని స్పష్టీకరణ
- వినియోగదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్ నేడు విజయవాడలోని రైతుబజార్లను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. గురునానక్ కాలనీ, పంట కాలువ రోడ్ లో ఉన్న రైతు బజార్లలో ప్రజలకు విక్రయించే సరకుల నాణ్యత, ధరలపై స్వయంగా పరిశీలన

వివరాలు 2లో..

## నందిగం సురేశ్ ఆరోగ్యం బాగుందన్న వైద్యులు... తిరిగి జైలుకు తరలింపు!

- గుంటూరు జీజీహెచ్ లో సురేశ్ కు వైద్య పరీక్షలు
- సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ చేసిన వైద్యులు
- తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలింపు



పెన్ పవర్ డెస్క్:గుంటూరు జిల్లా జైల్లో ఉన్న వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. భుజం, ఛాతీ నొప్పి వస్తోందని జైలు అధికారులకు ఆయన చెప్పడంతో... ఆయనను చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్ కు తరలించారు. జీజీహెచ్ లో ఆయనకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ చేశారు. అనంతరం సురేశ్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు రిపోర్ట్ ఇచ్చారు. దీంతో, ఆయనను ఆసుపత్రి నుంచి తిరిగి జైలుకు పోలీసులు తరలించారు. మరోవైపు నందిగం సురేశ్ వచ్చిన సందర్భంగా ఆసుపత్రి వద్దకు వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. సురేశ్ ను చూసిన ఆయన భార్య కంటతడి పెట్టుకున్నారు. వైసీపీ శ్రేణులకు అభివాదం చెపుతూ పోలీసులతో కలిసి సురేశ్ అక్కడి నుంచి జైలుకు వెళ్లిపోయారు.

## అక్టోబర్ 15న ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం



పెన్ పవర్ డెస్క్:అక్టోబర్ 15న హర్యానా ముఖ్యమంత్రి గా బీజేపీ నేత నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి 10 మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి పంచకుల జిల్లా కమీషనర్ నేతృత్వం వహించనున్నారు.
నయాబ్ సింగ్ సైనీ స్వీకారోత్సవానికి బీజేపీ అగ్రనేతలు ప్రధాని మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా

వివరాలు 2లో..

## రంగులు, బొమ్మలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు



పెన్ పవర్ డెస్క్:వంద రోజుల పాలనలో ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయం నాలుగో బ్లాక్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సత్తా చాటేలా ఒకే రోజులో 60 లక్షలకు పైగా పింఛన్లను

వివరాలు 2లో..

## కాకినాడ డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం

- పవన్ పేరు చెబుతూ మైనింగ్, అటవీ సిబ్బందితో రవీంద్రనాథ్ రెడ్డి సమావేశాలు
- తాను చెప్పినప్పుడే మైనింగ్ వాహనాలు కదలాలని హుకుం
- రవీంద్రనాథ్ రెడ్డిపై విచారణకు పవన్ ఆదేశాలు

వివరాలు 2లో..



## రేవంత్ రెడ్డి మూసీ ప్రాంతంలో పర్యటించి కూల్చివేతలకు ఒప్పించాలి

### కూల్చివేతలు అంత ఈజీ కాదన్న కిషన్ రెడ్డి

### మూసీ రిటర్నింగ్ వాల్‌ను నిర్మించి కూడా సుందరీకరణ చేయవచ్చని వెల్లడి

### రేస్ కోర్స్ అమ్మి మరీ సుందరీకరణ పనులు అవసరం లేదన్న కేంద్రమంత్రి



పెన్ పవర్ డెస్క్: కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేదల ఇళ్ల కూల్చివేత సరికాదన్నారు. ఇక్కడి పేదలకు బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇక్కడ నివసించే ప్రజలు ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టుకొని ఇళ్లను కొనుక్కున్నారని తెలిపారు.

వివరాలు 2లో..



## జగన్ రాసేది గుడ్ బుక్ కాదు... గుడ్డి బుక్

పెన్ పవర్ డెస్క్:కక్ష సాధింపు చర్యల కోసం నారా లోకేశ్ రెడ్ బుక్ తీసుకువస్తే, తాము మంచి పనులు చేసిన వారి పేర్లను రాసేందుకు గుడ్ బుక్ తీసుకువస్తామని వైసీపీ అధినేత జగన్ ప్రకటించడం తెలిసిందే. దీనిపై టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్పందించారు. జగన్ రాసేది గుడ్ బుక్ కాదని, గుడ్డి బుక్ అని ఎద్దేవా చేశారు. గడచిన ఐదేళ్లలో జగన్ చేసిన మంచి పని ఇదీ అని చెప్పుకోవడానికి ఒక్కటైనా ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ముంచడం తప్ప జగన్ చేసింది గుండు సున్నా అని విమర్శించారు. ముఖ్యమంత్రిగా అనేక పర్యాయాలు ఢిల్లీ వెళ్లిన జగన్ ఎనాడైనా

వివరాలు 2లో..

- లోకేశ్ కక్ష సాధింపు చర్యల కోసం రెడ్ బుక్ తెచ్చారన్న జగన్
- తాము మంచి పనులు చేసిన వారి కోసం గుడ్ బుక్ తెస్తామని వెల్లడి
- జగన్ పై ధ్వజమెత్తిన టీడీపీ ఎమ్మెల్యే

## ఎడిటర్ వ్యూ

# రాజకీయాల్లో అనైతిక ధోరణులు

ప్రస్తుత రాజకీయాల్లో అనైతిక ధోరణులు పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు ఆయా రాజకీయా పార్టీలు, రాజకీయ నేతల మధ్య సైద్ధాంతిక విబేధాలు మాత్రమే ఉండేవి. ప్రతిపక్షం, విపక్షం అనే తేడా లేకుండా ఆనాడు రాజకీయ నాయకులు ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయ రంగంలోకి అడుగుపెట్టేవారు. రాజకీయ నేతలకు ఆనాటి ప్రజలు అలాగే చక్కటి గౌరవం ఇచ్చేవారు. ఒక రాజకీయ పార్టీకి మరో రాజకీయ పార్టీ, ఒక నేతకు మరో నేత అత్యంత గౌరవం ఇచ్చిపుచ్చుకునే ధోరణి అలనాటి రాజకీయ తరంలో ఉండేది. ఆ తర్వాతి నుంచి రాజకీయాలు క్రమక్రమంగా మలినం అయ్యాయి. రాజకీయాల్లో నైతిక విలువలు మాయమయ్యాయి. రౌడీలు, గూండాలు, కుల , మత పిచ్చి ఉన్నవారు, డబ్బు సంపాదనే ధ్యేయంగా వచ్చేవారు, అధికారం అనే హోదా ఉండాలనుకునే వారు ఎక్కువ సంఖ్యలో రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ప్రారంభమైంది. దీంతో మంచి రాజకీయ నేతలు ఉన్నా వారిని ప్రస్తుత రాజకీయాల్లో వెతికి పట్టుకోవాలంటే చాల కష్టమైన పని. ప్రతీ రాజకీయ పార్టీ గెలుపు గుర్రాలనే ఎన్నికల్లో నిలబెట్టేందుకు వారి గత చరిత్ర, స్వభావం, కేసులు వంటివి పట్టుంచుకోకుండా టికెట్లు ఇవ్వడం ప్రారంభమయ్యాయి. దాంతో రాజకీయాలు నేరాలు కవలలుగా మారాయి. ఇదంతా ఎందుకంటే యాథారాజ తథా ప్రజ అన్నట్లు... ప్రస్తుత రెండు తెలుగు రాష్ట్రాల్లో నాయకులు, వారి అనుచర గణం వ్యవహరిస్తున్న తీరు జుగుప్సను కలిగించేలా ఉంది. తమ ప్రత్యర్థిని లేదా ప్రత్యర్థి పార్టీని దెబ్బతీసేందుకు నైతిక నియమాలు, విలువలను పక్కనబెట్టి మరీ వ్యహరిస్తున్న తీరు దిగజారుతున్న రాజకీయాలకు నిదర్శనంగా చెప్పవచ్చుఒకప్పుడు రాజకీయ నేతలంటే మాట మీద నిలబడే వారే అనే వారు. ఇప్పుడు నోరు జారితేనే, దురుసుగా మాట్లాడితేనే, సీనియర్ అయినా జూనియర్ అయినా నోటికొచ్చిన తిట్లు తిడితేనే నేతలన్న రీతిలో పరిస్థితి మారింది. ప్రత్యర్థి పార్టీని లేదా ఆ పార్టీ అధినేతను ఎవరు బాగా తిడతారో వాళ్లనే రాజకీయ పార్టీ పెద్దలు ప్రోత్సహిస్తున్నారు. దీంతో తల్లి, చెల్లి, కొడుకు, కూతురు అనే తేడా లేకుండా నాయకుల మీద నాయకుల కుటుంబ సభ్యుల మీద ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తున్నారు. సిద్ధాంతాలు, అభివృద్ధి అనే అంశాలు పక్కకు పోయాయి. వ్యక్తిగత విమర్శలు, బెడ్ రూంలో విషయాలు, వ్యక్తిగత అలవాట్లు అభిరుచులపై విమర్శలు –ప్రతి విమర్శలు చేస్తున్నారు. రాజకీయ నైతిక నియమాలను సీనియర్ నేతలే తుంగలో తొక్కుతుంటే, వారి అనుచరణ గణం, పార్టీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయి సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన రాతలు, మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలతో ప్రత్యర్థి నేతలను అడ్డుకునే చీప్ పాలిట్రిక్స్‌కు పాల్పడుతున్నారు. నిజం ఏంటో చెప్పేలోపే ఈ అబద్ధం క్షణాల్లో అందరి మొబైల్స్‌లో ప్రత్యక్షమవుతుంటే ఏం చేయలో తెలియక అటు నేతలు, వారి కుటుంబ సభ్యులు మౌనంగా రోదిస్తున్నారు. ఇదంతా ప్రస్తుత మన నేతల చలవే. ఇలాంటి వారిని ముందుగానే కట్టడి చేయకుండా వదిలేయడంతో రాజకీయం అంటే ఇదే అన్న రీతిలో ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీల్లో ఈ అనైతిక ధోరణి ప్రబలిందిఏపీలో ఓ నాయకుడు ఏకంగా సీనియర్ పొలిటీషియన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులపైనే అతిగా మాట్లాడటం, దాని మీద స్వయాన చంద్రబాబు రోదించడం మనం టీవీల్లో చూశాం. అదే రీతిలో ప్రత్యర్థి పార్టీ నాయకుడి వైఎస్ జగన్ కుటుంబ సభ్యుల మీద ఇదే రీతిలో ఓ హీరోతో అనైతిక సంబంధాలను అంటగట్టి ప్రచారం చేయడం జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కుమారుడి మీద బాధాకరమైన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఒక్క మాట చెప్పాలంటే మనం ప్రోత్సహించిన మాటల భూతమే ఇప్పుడు అన్ని పార్టీల నేతలను కాటు వేయాలని చూస్తోంది.అదే రీతిలో తెలంగాణలోనూ ఉద్యమ సమయంలోను, ఇప్పుడు కూడా వివాదస్పద వ్యాఖ్యలను నేతలు చెస్తూనే వస్తూ ఉన్నారు. పరుష పదజాలంతో మాట్లాడితేనే మీడియాలోవార్తలు వస్తాయని కొందరు, పరుషంగా మాట్లడితేనే ప్రజలు జై కొడతారని కొందరు నేతలు ఇష్టారీతిన అనైతిక వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారుగత అసెంబ్లీ సమావేశాల సమయంలో మంత్రి సీతక్కపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన రీతిలో పోస్టులు పెట్టి కొందరు పైశాచిక ఆనందం పొందారు. ఇటీవలె మరో మహిళా మంత్రి కొండాసురేఖ, ఎంపీ రఘునందన్ రావు ఫోటోలతో తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తూ సోషల్ మీడియాలో రచ్చ చేశారు. వీటిపై ఆయా పార్టీలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నా చూసీ చూడనట్లు ఉండటంతో ఆయా పార్టీలో కొందరు అత్యుత్సాహంతో గీత దాటి అనైతిక ప్రచారాలకు పాల్పడుతున్నవైనాలు సంభవిస్తున్నాయి.ఏపీ, తెలంగాణలో ప్రస్తుతం పరుషంగా మాట్లాడట ట్రెండ్ గా మారింది. తెలంగాణ ఉద్యమంలో బీఆర్ఎస్ నేతల మాటలు విన్నా, వారికి కౌంటర్‌గా బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు విన్నా ఎంతటి సంచలనంగా మారాయో మనకు తెలియంది కాదు. తాట తీస్తాం, పూడ్చి పెడతాం, ఉరికించి కొడతాం, బట్టలూడదీస్తాం లాంటి పదాలు తరచూ వినబడుతున్నాయి. చవట, సన్నాసి అంటే రాజకీయనేతలేమో అన్న రీతిలో తమ ప్రసంగాల్లో ఆయా నేతలను తిట్టడం ద్వారా, ఆ పదాలకు పొలిటికల్ లీడర్లే ఓ బ్రాండ్ ఇమేజి తెస్తున్నారు. అంతే కాదు నేతల వ్యక్తిగత అలవాట్ల మీద ప్రచారాలు చూశాం. ఇక కీలకమైన నేతలు డా నోరు జారడం మనం చూస్తున్నాం.సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ సబితా ఇంద్రారెడ్డిని ఉద్దేశించి వారిని నమ్ముకోకండి ముంచేస్తారు అన్న పదం తీవ్ర దుమారం రేపింది. అదే రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిన మహిళకు ఉచిత బస్ ప్రయాణంపై మాట్లాడుతూ డాన్సులు చేసుకోవడానికా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. సీనియర్ లీడర్లు కూడా కొన్ని సార్లు తెలిసి మాట్లాడినా, తెలియక మాట్లాడినా వెంటనే దానిపై బేషరతుగా తప్పని ఒప్పుకుంటే హుందాగా ఉండేది. దానిపై మౌనంగా ఉంటడం, సమర్థించుకోవడం రెండు తప్పే. ఈ ధోరణి ఇతర నేతలకు, కార్యకర్తలకు తమ నాయకుల్లానే వ్యహరించాలని, మాట్లాడాలని ఓ మోడల్ గా తీసుకునే అవకాశం ఉంది.తాజాగా మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో చేసిన ప్రచారం తెలిసిందే. దీనిపై మంత్రి కొండా సురేఖ ఏకంగా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇది జరిగిన వెంటనే కేటీఆర్‌పై విమర్శలకు దిగిన మహిళా మంత్రి కొండా సురేఖ కూడా సంయమనం కోల్పోయి వ్యక్తిగత అంశాలపై నోరు జారారు. ప్రముఖ హీరోయిన్ సమంత, హీరో అక్కినేని నాగార్జున కుటుంబ వ్యవహారలను కేటీఆర్‌కు ముడిపెడుతూ మాట్లాడటం అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.రెండు తెలుగు రాష్ట్రాల్లో నోటి మాటలు హద్దు మీరుతున్నాయి. పదునైన మాటలు, బాధించే భాషా ప్రయోగం, హేయమైన విమర్శలతో ఒకరిపై ఒకరు వ్యక్తిత్వం దెబ్బతీసుకునేలా వ్యహరిస్తున్న తీరు గర్హనీయం అనే చెప్పాలి.విషయం ఉన్నా లేకున్నా, ప్రాస, యాస, రైమింగ్ వర్డ్స్ కోసం చాలా మంది నేతలు ప్రయాస పడుతున్నారు. పరుష పదజాలం ఉంటేనే అద్భుతమైన ప్రసంగంగా ఆ నేతల వందిమాగదులు, కొన్నిసార్లు కొన్ని మీడియా సంస్థలు గుర్తించే పరిస్థితి ఏర్పడింది

# చట్టాన్ని ఉల్లంఘించిన బ్యాచ్‌పై యాక్షన్ అనివార్యం

- మొదటి పేజీ తరువాయి

రిలయన్స్ వంటి కంపెనీలు ప్రస్తుతం ఏపీ వైపు చూస్తున్నాయని ఆయన అన్నారు. దానికి కారణం మన బ్రాండ్ అంబాసిడర్, ఆయన పేరే నారా చంద్రబాబు నాయుడు అని లోకేశ్ పేర్కొన్నారు. ఎక్కడి వెళ్లినా చంద్రబాబు నాయుడి రాష్ట్రం అంటున్నారని, ఆయనపై ఉన్న విశ్వసనీయత, నమ్మకం వల్లే రాష్ట్రంలోకి తిరిగి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఉందని తెలిపారు.
భారతదేశంలో ఎక్కడికి వెళ్లినా అక్కడ కనిపించే కియా కార్లు 'మేడిన్ ఆంధ్రప్రదేశ్' కావడం గర్వించదగ్గ విషయమని లోకేశ్ వివరించారు.

**రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమలు**

రాజధాని ప్రాంతంలో ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు పెద్ద ఎత్తున ఇన్వెస్ట్‌మెంట్స్ వస్తాయని మంత్రి నారా లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. సేవల రంగానికి చెందిన కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకొస్తామని ఆయన అన్నారు. రాయలసీమలో తయారీ రంగ పరిశ్రమల నెలకొల్పుతామని అన్నారు. గోదావరి జిల్లాల్లో ఆక్వా, పెట్రో కెమికల్స్ సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**జగన్ జిల్లాల పర్యటనకు అనుమతి ఇస్తాం**

మాజీ సీఎం జగన్ జిల్లాల పర్యటనకు వెళితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మిషన్ ఇస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక రెడ్‌బుక్‌లో పేరు ఉందంటూ వైసీపీ నాయకులు వణికిపోతున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పాదయాత్ర సమయంలో చెప్పినట్టుగానే భూకబ్జాలకు పాల్పడిన వారిపై,
చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పకుండా తీసుకుంటామని అన్నారు. అలాంటి వారిని విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై నకిలీ వార్తలు ప్రచారం చేస్తున్నారని, ఫేక్ ప్రచారం చేసేవాళ్లపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి వార్నింగ్ ఇచ్చారు. ఫేక్ ప్రచారం చేసేవారిపై చర్యల విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరంలేదని అన్నారు.

# విజయవాడలో రైతు బజార్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నాదెండ్ల

- మొదటి పేజీ తరువాయి

చేపట్టారు. నాణ్యత లేని ఉత్పత్తులు విక్రయిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.
వంటనూనెలు, ఉల్లి, టమాటా విక్రయాలపై వినియోగదారులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. పామాయిల్ రూ.110కి, సన్ ఫ్లవర్ ఆయిల్ ను రూ.124కు విక్రయించాలని ఆదేశాలు ఇచ్చారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ఒకే రకమైన ధరల్ని అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయించిందని స్పష్టం చేశారు. ఆ మేరకు రైతు బజార్ లలోని దుకాణాల వద్ద ధరలు సూచించే బోర్డులు ఏర్పాటు చేయించారు.
ఇక, ప్రతి రేషన్ కార్డుపై రిఫైన్డ్ ఆయిల్‌ను గరిష్ఠంగా రూ.124కు, పామాయిల్‌ను రూ.110కు విక్రయించాలని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో... రాష్ట్రంలోని కోటి 49 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డు ద్వారా సబ్సిడీ ధరలపై వంట నూనె అందనుంది.

# కాకినాడ డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

ఏపీ డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవీంద్రనాథ్ రెడ్డి కాకినాడ డీఎఫ్ఓగా పనిచేస్తున్నారు. అయితే, పవన్ కల్యాణ్ పేరు చెబుతూ మైనింగ్, అటవీశాఖ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తున్నారంటూ ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీనిపై పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. పవన్ కల్యాణ్ తో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ రవీంద్రనాథ్ రెడ్డి చెప్పుకుంటున్నట్టు తెలిసింది. తాను చెప్పినప్పుడు మాత్రమే మైనింగ్ వాహనాలు బయటకు కదలాలని అధికారులకు రవీంద్రనాథ్ రెడ్డి హుకుం జారీ చేసిన విషయం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో, రవీంద్రనాథ్ రెడ్డి వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరపాలంటూ పవన్ ఆదేశాలు జారీ చేశారు.

# రంగులు, బొమ్మలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు

- మొదటి పేజీ తరువాయి

పంపిణీ చేయించిన ఘనత చంద్రబాబుదే అని తెలిపారు. గత ప్రభుత్వం అన్నింటి పైనా రంగులు, బొమ్మలు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల సొమ్మును జాగ్రత్తగా కాపాడుతోందని చెప్పారు. "రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకువచ్చి లక్షల మందికి ఉపాధి కల్పించే ప్రయత్నం జరుగుతోంది. పెట్టుబడిదారులు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. గత ప్రభుత్వం మేనిఫెస్టో పేరిట దోపిడీ చేసింది. రూ.10.50 లక్షల కోట్ల అప్పులు చేసింది. అవినీతిని కూడా వ్యవస్థీకృతం చేసిన ఘనత వైకాపాది. లబ్ధిదారులకు ఇచ్చే రూ.2.5 లక్షల గృహ నిర్మాణ వ్యయాన్ని రూ.1.80 లక్షలకు తగ్గించింది కూడా ఆ పార్టీనే. రాష్ట్రంలో అందరికీ
ఇళ్లు ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోంది. సాక్షి పత్రిక కొనుగోలు కోసం గత ప్రభుత్వం నిధులు ఇవ్వడంపై విచారణ జరుగుతోంది. ప్రకటనలు ఒకే పత్రికకు ఇచ్చిన అంశంపై కూడా విచారణ చేస్తున్నాం" అని కొలుసు పార్థసారథి తెలిపారు.

# రేవంత్ రెడ్డి మూసీ ప్రాంతంలో పర్యటించి కూల్చివేతలకు ఒప్పించాలి

- మొదటి పేజీ తరువాయి

అలాంటి వాటిని కూల్చడమేమిటన్నారు.
మూసీ రిటర్నింగ్ వాల్‌ను నిర్మించి కూడా సుందరీకరణ చేయవచ్చన్నారు. అన్ని డ్రైనేజీలు మూసీలోనే కలుస్తాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందన్నారు. తక్కువ ఖర్చుతోనే కేంద్ర ప్రభుత్వం గంగానదిని శుభ్రం చేస్తోందని కిషన్ రెడ్డి వెల్లడించారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు అవసరం లేదన్నారు. రేస్ కోర్స్ స్థలాన్ని అమ్మి మరీ సుందరీకరణ పనులు చేయాల్సిన అవసరం లేదన్నారు.ఎలాంటి ప్లాన్ లేకుండా హైడ్రా పేరుతో కూల్చివేతలు సరికాదన్నారు. ముఖ్యమంత్రి దూకుడుగా వ్యవహరిస్తామంటే కుదరదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలను బెదిరింపులకు, భయాందోళనకు గురి చేసిందన్నారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ ప్రక్రియ అన్నారు. హైడ్రా బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

**బస్ డిపో, మెట్రోను కూల్చాలని డిమాండ్**

గతంలోనూ ప్రభుత్వాలు నిర్మాణాలను కూల్చివేశాయని, కానీ ఇప్పుడు పేరు మాత్రమే హైడ్రా అని మార్చారని కిషన్ రెడ్డి విమర్శించారు. చెరువులను, నాలాలను కాపాడేందుకే అని చెప్పే హైడ్రా మొదట మూసీ నదిలో ఉన్న బస్సు డిపోను, మెట్రో పిల్లర్స్‌ను, మెట్రో స్టేషన్‌ను కూల్చాలని డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా పేదల ఇళ్లు ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా తనను సంప్రదించడం లేదని స్పష్టం చేశారు.

**ఎన్నికల ఫలితాలపై స్పందించిన కిషన్ రెడ్డి**

జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలపై కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్రంలోని 98 శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయన్నారు. కశ్మీరీ పండిట్ల ఓట్లు బీజేపీకే పడ్డాయన్నారు. ఆర్టికల్ 370 రద్దు ఓ చరిత్ర, దానిని తిరిగి తీసుకువచ్చే అవకాశమే లేదన్నారు. ఝూర ఒడ్ ఎన్నికల్లోనూ తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో పాక్ ఆటలు సాగవన్నారు.

# జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి

**పెన్ పవర్ డెస్క్:** ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతిని జపాన్ సంస్థ 'నిహాన్ హిడాంకియో' గెలుచుకుంది. ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కృషి చేసినందుకు గాను జపాన్ సంస్థను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. 1945, ఆగష్టు 6, 9వ తేదీలలో జపాన్ నగరాలైన హిరోషిమా, నాగసాకిలపై అమెరికా అణు బాంబులు వేసిన వేసిన విషయం తెలిసిందే. ఈ అణుదాడి నుంచి ప్రాణాలతో బయటపడిన వారు నిహాన్ హిడాంకియో సంస్థను ప్రారంభించారు. 1956లో ఈ సంస్థ ఏర్పాటైంది.
అణ్వాయుధ రహిత ప్రపంచాన్ని నిహాన్ హిడాంకియో సంస్థ కోరుకుంటున్నట్లు నార్వేయన్ నోబెల్ కమిటీ తన ప్రకటనలో వెల్లడించింది.
న్యూక్లియర్ ఆయుధాలను మళ్లీ వాడరాదని ఆ సంస్థ ప్రత్యక్ష బాధితులతో ప్రదర్శనలు ఇచ్చినట్లు కమిటీ పేర్కొంది.నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి ప్రధానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 104 సార్లు నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించారు. వ్యక్తులతో పాటు సంస్థలను నోబెల్ శాంతి బంహుమతికి ఎంపిక చేస్తారు. గతంలో నోబెల్ శాంతి బహుమతి పొందిన వారిలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా వంటి ప్రముఖులు ఉన్నారు.

# అక్టోబర్ 15న ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీ ప్రమాణ స్వీకారం

- మొదటి పేజీ తరువాయి

తదితరులు హాజరుకానున్నట్లు సమాచారం. కాగా, ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ 48 స్థానాల్లో విజయం సాధించింది.

**ఖట్టర్‌ను తప్పించి సైనీకి అవకాశం**

ఈ ఏడాది మార్చిలో అప్పటి ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను తప్పించి నయాబ్ సింగ్ సైనీకి బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. రాబోవు ఎన్నికల్లో సైనీ గెలిస్తే అత్యున్నత పదవికి ఎంపిక అవుతారని బిజెపి ఎన్నికల సమయంలో సూచించింది. సైనీ రాష్ట్రంలోని ప్రధాన ఓటు బ్యాంకు అయిన వెనుకబడిన తరగతుల (%బాదీజ%లు) నుండి వచ్చారు.

# తెలుగు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన జగన్

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పర్వదినాలను పురస్కరించుకుని ఏపీ, తెలంగాణ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. లోక కంఠకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి సాధించిన విజయానికి, దుష్ట శక్తులపై దైవ శక్తుల గెలుపునకు ప్రతీకగా జరుపుకునే పండుగ దసరా అని జగన్ వివరించారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా... మంచితనాన్నే అంతిమ విజయం వరిస్తుందని పేర్కొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరిసంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని... ఆ కనకదుర్గమ్మ దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని జగన్ ఆకాంక్షించారు.

# జగన్ రాసేది గుడ్ బుక్ కాదు... గుడ్డి బుక్

- మొదటి పేజీ తరువాయి

ఒక్క రూపాయి తెచ్చాడా? అని ఎత్తిపొడిచారు. కూటమి ప్రభుత్వం ఎందుకు మంచిదో చంద్రబాబు చేతలతోనే చూపిస్తున్నాడని జీవీ పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.2,348 కోట్ల ముందస్తు నిధులు చంద్రబాబు కృషి ఫలితమేనని అన్నారు. అమరావతి రింగ్ రోడ్ కు అనుమతులు, వ్యయాన్ని భరించేలా కేంద్రాన్ని ఒప్పించడం చంద్రబాబు ఘనతేనని తెలిపారు. రోడ్ల గుంతలను పూడ్చేందుకే రూ.300 కోట్లను కేటాయించారని జీవీ వివరించారు. ఆరోగ్యశ్రీపై జగన్ ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని వెల్లడించారు. జగన్ హయాంలో పారిపోయిన పరిశ్రమలు కూటమి ప్రభుత్వం రాగానే తిరిగి వస్తున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు చంద్రన్న బీమా పథకాన్ని మళ్లీ తీసుకువచ్చారని వివరించారు.

# తిరుమల శ్రీవారి చక్రస్నానానికి ఘనంగా ఏర్పాట్లు



తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. రేపు స్వామివారికి చక్రస్నానం ఘట్టం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీగా ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు మీడియాతో మాట్లాడారు.
బ్రహ్మోత్సవాల్లో చివరి అంకం చక్రస్నానానికి 30 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తుల రాకకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎంట్రీ గేట్లు, ఎగ్జిట్ గేట్లు ఏర్పాటు చేశామని... భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని వివరించారు. మొత్తం 40 వేల మంది సిబ్బంది సేవలు వినియోగించుకుంటామని... పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని ఈవో శ్యామలరావు వెల్లడించారు. స్వామివారి పుష్కరిణి వద్ద రెండు బోట్లు కూడా సిద్ధంగా ఉంచామని తెలిపారు.

# రోజా కంటే శ్యామలే బెటరా....

**తిరుపతి, అక్టోబరు 11, పెన్ పవర్:** మాజీ మంత్రి రోజా సెల్వమణి వైసీపీ నేతల్లో ప్రస్తుతం అంతో ఇంతో యాక్టివ్‌గా ఉన్న నేతల్లో ఒకరు ? పార్టీ ఓటమి తర్వాత బూతు మంత్రులు అనిపించున్న వారంతా తెరమరుగైపోయినా? రోజా మాత్రం అప్పుడప్పుడు మీడియాలో ఫోకస్ అవుతున్నారు ? అయితే రికార్డెడ్ వీడియోస్ రిలీజ్ చేస్తూ, ట్వీట్లకే పరిమితమవుతున్నారు .. దాంతో అసలు ఆమె ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుపట్టకుండా తయారైంది? ఒకవైపు యాంకర్ శ్యామల వంటి వారు వైసీపీ అధికార ప్రతినిధి హోదాలో మీడియా ముందుకొస్తున్నా? రోజా మీడియాకు ముఖం చాటేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోని పుంగనూరులో బాలిక అదృశ్యమై హత్యకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ ఘటనపై తక్షణమే స్పందించిన ప్రభుత్వం హత్యకు కారణాలు గుర్తించి.. నిందితులను అరెస్ట్ చేయడంలో సక్సెస్ అయింది. ఆ బాలికను ఆర్థిక లావాదేవీల కారణంగా హత్య చేశారని పోలీసులు ప్రకటించినా.. వైసీపీ నేతలు మాత్రం బాలికపై అత్యాచారం జరిగిందని రాద్ధాంతం చేశారు. కక్షపూరితంగా జరిగిన ఆ హత్యకు రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై మాజీ మంత్రి రోజా.. ప్రీ రికార్డెడ్ వీడియో రిలీజ్ చేశారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాల్లో చిన్నారులకు రక్షణ లేకుండా పోతుందని.. ఆడపిల్లలను స్కూళ్లకు పంపించాలంటే తెగ భయమేస్తుందని తెగ ఆవేదన వ్యక్తం చేశారు. సీన్ కట్ చేస్తే పుంగనూరు బాలిక హత్యపై అంత రాద్ధాంతం చేసిన వైసీపీ యూటర్న్ తీసుకుంది? బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి వైసీపీ అధ్యక్షుడు జగన్ వస్తున్నారని ప్రకటించిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరుసటి రోజే జగన్ టూర్ రద్దైందని ప్రకటించారు. ప్రభుత్వం ఆ ఘటనపై సకాలంలో స్పందించిందని, అందుకే జగన్ పర్యటన రద్దు చేసుకున్నారని



వివరణ ఇచ్చారు. పెద్దిరెడ్డి అంత క్లారిటీ ఇచ్చినప్పటికీ రోజా తిరిగి ఆ ఘటనపై స్పందించలేదు. ఇంతలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం ఘటన వెలుగు చూసింది. బాలిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో నిందితులు ఆమెను తిరిగి ఆటోలో ఎక్కిస్తుండగా, స్థానికులు పట్టుకుని వారిని పోలీసులకు అప్పగించారు. బాలిక బంధువు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదులోకి తీసుకున్నారు. దానిపై రోజా ట్విట్టర్లో స్పందించారు. 'డిప్యూటీ సీఎం సొంత ఇలాఖాలోనే ఓ మైనర్ బాలికపై దారుణం జరిగితే చర్యలు లేవు" అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు రోజా. అంతకు ముందు వరదల సమయంలో కూడా రోజా ప్రభుత్వ సహాయక చర్యలపై అవగాహన లేకుండా విచిత్రమైన వ్యాఖ్యలు చేశారు. సీఎం సహా మంత్రులు వరద నీటిలో తిరుగుతూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తుంటే. ప్రభుత్వ పెద్దలపై అనుచిత వ్యాఖ్యలు చేసి విమర్శలు మూట గట్టుకున్నారు. తర్వాత తిరుమల లడ్డూ వివాదంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడి విమర్శలు మూట గట్టుకున్నారు స్పాట్ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రోజా నోటి దూకుడు ఏ స్థాయిలో ఉండేదో అందరికీ తెలిసిందే. ఆ నోటి దూకుడు పార్టీకి తీవ్ర నష్టం చేసిందని వైసీపీ నేతలే అంటున్నారు. అందుకే ఆమెకు జగన్ అధికార ప్రతినిధి హోదా కూడా ఇవ్వలేదని, అందుకే ఆమె ఉనికి కోసం రికార్డెడ్ వీడియోలు రిలీజ్ చేస్తూ.. ఎక్స్ వేదికగా రెచ్చిపోతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోజా కంటే రాజకీయాల్లో జూనియర్లు, అసలు రోజాకు ఏ రకంగా సమఉజ్జీ కాని యాంకర్ శ్యామల వంటి వారి వైసీపీలో అధికార ప్రతినిధి హోదా దక్కింది. శ్యామల రాజకీయంగా ఉనికి చాటుకోవడానికి ప్రెస్ మీట్లు పెడుతూ హడావుడి చేయాలని చూస్తున్నారు. అయితే సొంత సెగ్మెంట్ నగరిలో కనీసం అడుగుపెట్టలేకపోతున్న రోజా ఓటమి తర్వాత తెరచాటు రాజకీయాలకే పరిమితమవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రైవేట్ కు రుషికొండ ప్యాలెస్

**విశాఖపట్టణం, అక్టోబరు 11,, పెన్ పవర్:** జిల్ జిగేల్‌మంటూ శ్వేతవర్ణంతో మెరిసిపోతున్న భవంతులు.. పెద్ద పెద్ద ప్రవేశ ద్వారాలు.. విశాలమైన బెడ్రూమ్స్, అందుకు ఏ మాత్రం తీసిపోని స్నానాల గదులు, అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, బాత్ టబ్‌లు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లతో మెరిసిపోయే ఆ వైభోగాన్ని కళ్లారా చూడాల్సిందే తప్ప వర్ణించలేం. ప్రభుత్వ ఖర్చులతోనే నిర్మించిన ఆ కట్టడం ఓ రాజభవనం. ఏ వైట్‌హౌస్ లోపలికో, బకింగ్‌హాం ప్యాలెస్‌లోకో అడుగుపెట్టిన ఫీలింగ్ కలుగుతుంది. అవే రుషికొండ సౌధం. గత వైసీపీ హయాంలో భీమిలి బీచ్ రోడ్డులో సముద్రాన్ని ఆనుకుని రుషికొండపై కట్టిన భవంతుల చుట్టూ ఇప్పటికీ వివాదం కొనసాగుతోంది. రూ.500 కోట్లతో అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఆ భవనాల్ని ఇప్పుడేం చేస్తారన్న చర్చ మొదలైంది. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ప్రముఖులు వచ్చినప్పుడు అతిథి గృహాలుగా వాడేందుకు కట్టామని వైసీపీ నేతలు చెప్తున్నారు. అయితే అంత వివాదం అయినా అప్పుడు ఎందుకు ఈ విషయాన్ని చెప్పలేదని టీడీపీ ప్రశ్నిస్తోంది. వైఎస్ జగన్ ఉండటం కోసమే రుషికొండ ప్యాలెస్‌ను కట్టారని ఆరోపిస్తోంది. అయితే ఇప్పుడు రుషికొండ భవనాలపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై కూటమి సర్కార్ తర్జనభర్జన పడుతోంది. ప్రభుత్వ అవసరాలకే వాడుకుందామా లేక ప్రైవేటుకు ఇద్దామా అనేదానిపై ఇంటర్నల్‌గా చర్చలు జరుపుతోంది పర్యాటకశాఖపై సీఎం చంద్రబాబు పలుసార్లు రివ్యూలు చేసినా ఈ అంశం ప్రస్తావనకు రాలేదు. మంత్రులు దుర్గేశ్, లోకేశ్ విశాఖలో పర్యటించినా రుషికొండ భవనాన్ని సందర్శించలేదు. పర్యాటక శాఖ మంత్రి అయితే అది మ్యూజియంగా తప్ప దేనికి



పనికిరాదంటున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్తున్నారు. అయితే ఇప్పటికే ఖాళీగా ఉన్న ఈ భవనాల నిర్వహణకు ప్రతి నెలా లక్షల్లో ఖర్చవుతోంది. నిర్వహణ సామర్థ్యం, నైపుణ్యం ఉన్న సిబ్బంది లేరు. వీటిని రిసార్టులుగా మార్చాలన్నా అక్కడి నిర్మాణాలు అందుకు తగ్గట్లు లేవు. దీంతో వచ్చే ఆదాయం కన్నా నిర్వహణ భారం ఎక్కువవుతుందని భావిస్తున్నారు. అందుకే రుషికొండ భవనాలను ఏం చేయాలనే దానిపై ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోందిరుషికొండపై 9.88 ఎకరాల్లో 7 భవనాలు నిర్మించారు. అత్యాధునిక సౌకర్యాలతో కట్టిన ఈ భవనాల నిర్వహణకే ప్రతిరోజు లక్ష వరకు ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ నిపుణుల అంచనా వేస్తున్నారు. ఈ భవనాలను పూర్తిస్థాయిలో వాడటం మొదలుపెడితే 100 మంది వరకు సిబ్బంది అవసరమని చెప్తున్నారు. మరో 50 మంది షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుందని.. ఇప్పటికే కొన్ని వస్తువులు పాడైనట్లు చెబుతున్నారు. ఇక రుషికొండ భవనాలకు విద్యుత్తు బిల్లుల బకాయిలు పేరుకుపోతున్నాయి. ఐదు నెలల్లో ప్రతి నెలా సగటున 6 లక్షలపైనే బిల్లు వచ్చింది. ఇప్పటివరకు 85 లక్షల విద్యుత్ బిల్లు బకాయి ఉంది. ఖాళీగా ఉన్న భవనాలకే ప్రతినెలా 40 వేల నుంచి 60 వేల యూనిట్ల విద్యుత్తు ఖర్చవుతుంది. అదే వినియోగంలోకి వస్తే ఇది రెండింతలు అవుతుందని అంచనా. భవనాల దగ్గర 10వేల 4 చదరపు మీటర్లలో 58 రకాల మొక్కలు నాటారు. వీటిలో చాలావరకు విదేశాల నుంచి తెచ్చినవే. వాటి నిర్వహణ సరిగ్గా లేక చాలా మొక్కలు ఎండిపోయాయి. అయితే విలువైన ప్రభుత్వ ఆస్తిని నిరుపయోగంగా ఉంచడం సరికాదని పలువురు సూచిస్తున్నారు. దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

## సొంత జిల్లాలో వైసీపీకి నేతల కరువు



**కడప, అక్టోబరు 11, పెన్ పవర్:** దప జిల్లా అంటేనే వైసీపీ అధినేత సొంత జిల్లా. దాని పేరే వైఎస్సార్ కడప జిల్లాలో అలాంటి కడప జిల్లాలో వైసీపీ ఆపసోపాలు పడుతుంది. సరైన నాయకత్వం జిల్లాలో కొరవడింది. దీంతో అధికారం కోల్పోయిన తర్వాత వైఎస్ కుటుంబానికి ఆ జిల్లా దూరమవుతున్నట్లే కనపడుతుంది. నాయకత్వ లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అధికారం ఉన్నప్పుడు అందరూ నాయకులే. కానీ రాష్ట్రంలో అధికారం లేనప్పుడు మాత్రం ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదు. పార్టీకి పెద్ద దిక్కు అనేది లేకుండా పోయింది. దీంతో వైసీపీ క్యాడర్ కకావికలమవుతుంది. ఉన్న ద్వితీయ శ్రేణి నేతలు కూడా పార్టీని వీడి వెళ్లిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనే కడప జిల్లాలో వైసీపీ దారుణమైన ఫలితాలను చూసింది. 2019 ఎన్నికల్లో పది స్థానాలకు గాను పదింటిని గెలుచుకున్న వైసీపీ 2024 ఎన్నికల్లో మాత్రం మూడు స్థానా?లకే పరిమితమయింది. ఇది చాలదూ వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలో వైసీపీ పతనమయిందనడానికి ఉదాహరణ. తర్వాత జడ్.పి. ఛైర్మన్ పదవి పోకుండా ఎలాగోలా కాపాడుకోగలిగారు. అదీ వైఎస్ జగన్ ఇన్‌వాల్వ్ అయి వారితో సమావేశమయి కొంత భరోసా ఇవ్వడంతో జడ్పీ ఛైర్మన్ పదవి కోల్పోలేదు. అన్ని నియోజకవర్గాల్లో బలమైన నేతలున్నారు. ఇప్పుడు సిట్టింగ్ పార్లమెంటు సభ్యుడిగా వైఎస్ అవినాష్ రెడ్డి ఉన్నారు. అయినా ఎవరూ పార్టీని పట్టించుకోవడం లేదునియోజకవర్గంలో నేతలు పట్టించుకోక పోవడంతో పార్టీని వదలి ద్వితీయ శ్రేణి నేతలు వదలి వెళ్లిపోతున్నారు. టీడీపీ క్షేత్రస్థాయిలో బలం పుంజుకునే దిశగా అడుగులు వేస్తుంది. జగన్ కూడా బెంగళూరు - తాడేపల్లి మధ్య చక్కర్లు కొడుతుండటంతో ఇక నేతలు కూడా పట్టించుకోవడంలేదు. జమ్మలమడుగు వంటి పట్టున్న నియోజకవర్గంలోనూ పూర్తిగా పార్టీని ఇన్‌ఛార్జి సుధీర్ రెడ్డి వదిలేశారు. అయన నియోజకవర్గానికి దూరంగా ఉన్నారు. దీంతో అక్కడ క్యాడర్ కూడా అయోమయంలోనే ఉంది. అక్కడ రామసుబ్బారెడ్డికి పార్టీ బాధ్యతలను అప్పగించాలని వైసీపీ అధినాయకత్వం భావిస్తుంది. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదుఇక కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ నుంచి వెళ్లిపోయారు. టీడీపీ ఖాతాలోకి కమలాపురం మున్సిపాలిటీ దాదాపుగా వెళ్లిపోయింది. ఛైర్మన్ తో పాటు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు. జగన్ మేనమామ కమలాపురం నియోజకవర్గానికి మొన్నటివరకూ ప్రాతినిధ్యం వహించారు. వైసీపీ బలం ఎనిమిదికి పడిపోవడంతో అక్కడ వైసీపీ వీక్ అయింది. కౌన్సిలర్లు వెళ్లిపోతున్నా అక్కడ పట్టించుకునేందుకు ఎవరూ లేరు. ఏ నేత ప్రయత్నించకపోవడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది. ఇలా కడప జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో అదే పరిస్థితి నెలకొంది. మరి జగన్ రంగంలోకి దిగుతారా? లేదా? అన్నది చూడాలి.

## ఏపీలో భారీగా మద్యం దరఖాస్తులు



**విజయవాడ, అక్టోబరు11, పెన్ పవర్:** కొత్త షాపులు, కొత్త బ్రాండ్లు, కొత్త ధరలు, కొత్త మద్యం, కొత్త విధానం రాబోతోంది. ఏపీలో మద్యం షాపులకు విదేశాల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి. యూరప్, అమెరికా నుంచి ఆన్ లైన్ లో దరఖాస్తులు నమోదయ్యాయి. అమెరికా నుంచి 20 అప్లికేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మద్యం షాపుల టెండర్లకు సంబంధించి దరఖాస్తు గడువు సమీపిస్తోంది. ఈ క్రమంలో ఎక్కువ మంది దరఖాస్తులు వేస్తున్నారు. ఇప్పటివరకు 70వేలకు పైగా టెండర్లు వచ్చినట్లుగా తెలుస్తోంది. దాదాపుగా 1500 కోట్ల రూపాయలకుపైగా డిపాజిట్లు వచ్చినట్లుగా సమాచారం. ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉంది. ఏపీలో మద్యం దుకాణాల కోసం ప్రవేశపెట్టిన కొత్త విధానం. ఏపీలో మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇప్పటికే దరఖాస్తులను కూడా స్వీకరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు.. కోకొల్లలు వస్తున్నాయని చెప్పవచ్చు. అయితే ఈ దరఖాస్తులు సమర్పించేందుకు ఎవరైనా నాన్ రిఫండబుల్ ఫీజు అక్షరాలా రూ. 2 లక్షలు చెల్లించాలి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,396 దుకాణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులను 14వతేదీన అందరి ముందు ఎక్సైజ్ అధికారులు లాటరీ తీసి, దుకాణదారులను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ నెల 16 నుండి ఈ ప్రక్రియతో ప్రారంభమయ్యే మద్యం షాపులు ప్రారంభం కావచ్చు. అయితే.. దరఖాస్తు గడువును ప్రభుత్వం పెంచే అవకాశాలు ఉన్నట్లు కూడా వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఎలాగైనా మద్యం షాపును చేజిక్కించుకోవాలనుకున్న వ్యాపారస్తులు.. తమ దరఖాస్తులను తమ పేరిట.. అలాగే కుటుంబ సభ్యుల పేరిట కూడా అందించి.. తమ అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారట. అసలే ఆదాయం లేని ప్రభుత్వానికి ఈ మద్యం స్కీం.. ఆదాయాన్ని బాగానే తెచ్చిపెడుతోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం సుమారు 42 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని.. దీనితో సుమారుగా రూ. 830.96 కోట్ల రూపాయల ఆదాయం సమకూరిందని తెలుస్తోంది. అయితే ఇక్కడే సూపర్ ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఏపీలోని మద్యం షాపులకు కేవలం రాష్ట్ర ప్రజల నుండే కాకుండా.. విదేశాల నుండి కూడా దరఖాస్తులు వస్తున్నాయట. మద్యం షాపుల కోసం యూరప్, అమెరికా దేశాలలో ఉన్న ప్రవాసాంధ్రులు కూడా తమ దరఖాస్తులను ఎక్సైజ్ శాఖకు పంపిస్తున్నారని అధికారులు తెలుపుతున్నారు. అమెరికా నుండి తమకు 20 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళి తెలిపారు. ఏపీ మద్యం కొత్త పాలసీ క్రేజ్ విదేశాలకు కూడా పాకిందంటే.. అసలు మద్యం షాపుల ఏర్పాటుకు ఔత్సాహికులు ఏవిధంగా ముందుకు వస్తున్నారో చెప్పనవసరం లేదు. ఏది ఏమైనా.. కూటమి ప్రభుత్వం మందుబాబులకు కూడా ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించింది. అసలుసిసలైన బ్రాండ్ మద్యం మీ చెంతకు చేరుస్తాం.. ధరలు తగ్గిస్తాం అంటూ మందుబాబులపై వరాలజల్లు కురిపించింది. అందుకే మందుబాబులు కూడా హమ్మయ్య.. త్వరగా లాటరీ తీయాలి.. ఇక బ్రాండెడ్ కిక్కు కావాలనే రీతిలో.. కొత్త మద్యం షాపుల కోసం వెయిటింగ్ లో ఉన్నారట.

## గెలిస్తే తమ గొప్పా... ఓడిపోతే ఈవీఎంల తప్పా....



**విజయవాడ, అక్టోబరు 11, పెన్ పవర్:** ఓటమి చెందితే కాని ఈవీఎంలలో తేడా ఉన్నట్లు అర్థం కాదా? ఖచ్చితంగా తాము గెలుస్తామని భావించి ఓటమి పాలయితే దానిని ప్రజాభిప్రాయం కింద పరిగణనలోకి తీసుకోవడం లేదు మన నేతాశ్రీలు. గెలిస్తే అది మన వల్లనే అని జబ్బలు చరుచుకుంటారు. లేదంటే అవతలి వారిపై అసంతృప్తి అని చెబుతారు. అదే గెలవకుంటే మాత్రం అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించరు. నాడు చంద్రబాబు నాయుడు, నేడు వైఎస్ జగన్ ది అదే పరిస్థితి. ఎందుకంటే వారు గెలుపోటములను వెంటనే తీసుకోరు. ఆ తప్పిదాన్ని ఈవీఎంలపై నెట్టి తాము చేసిన తప్పులను మాత్రం ప్రజల దృష్టి నుంచి మరల్చేందుకు ఎక్కువ సార్లు కామెంట్స్ చేస్తుంటారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కేవలం 23 స్థానాలకే పరిమితమయింది. నిజానికి ఇంత తక్కువ స్థానాలు టీడీపీ చరిత్రలోనే రాలేదు. ఎన్నికలకు ముందు పసుపుకుంకుమలు ఇచ్చామనుకున్నారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను పరుగులు పెట్టించామని భావించారు. కానీ ఓడిపోవడంతో చంద్రబాబు ఈవీఎంలను తప్పు పట్టారు. నాడు చంద్రబాబు ఒంటరిగా పోటీ చేశారు. పవన్ కల్యాణ్, బీజేపీలు వేర్వేరుగా బరిలో ఉన్నారు. కానీ జగన్ కు ఒకసారి ఇవ్వాలని భావించిన ప్రజలు ఫ్యాన్ పార్టీకే పట్టం కట్టారు. 151 స్థానాలను చరిత్రలో తొలిసారి ఒక పార్టీకి కట్టబెట్టి ఏకపక్ష తీర్పు చెప్పారు. దీంతో ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయి ఈవీఎంలలో ఏదో తేడా ఉందన్నారు. టీడీపీ సోషల్ మీడియా కూడా అదే తరహా ప్రచారం చేసింది. 2024 ఎన్నికలు ఇప్పుడు వైఎస్ జగన్ కూడా అదే రాగం మొదలు పెట్టారు. వైసీపీకి మొన్నటి ఎన్నికల్లో కేవలం 11 స్థానాలు మాత్రమే వచ్చాయి. జగన్ కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో వైఎస్ జగన్ నింద ఈవీఎంలపై నెట్టేశారు. ముందస్తు, ఎన్నికల అనంతరం సర్వేలు కూడా తమకు అనుకూలంగా వస్తే తాము ఎలా ఓడిపోగలమని వారు ప్రశ్నిస్తున్నారు. తాజాగా హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఈవీఎంలు కారణం అంటూ ఆ పార్టీ చేస్తున్న వాదనకు జగన్ కూడా మద్దతుగా నిలిచారు. బ్యాలట్ విధానమే మంచిదని అన్నారు. ప్రజాభిప్రాయం ప్రతిబింబించాలంటే ఇతర దేశాల మాదిరిగా బ్యాలెట్ పేపర్లను వినియోగించాలన్నారు.. ఇరువురు నేతలు ఒకసారి ఓడి మరొకసారి గెలిచిన వాళ్లే. ఇద్దరూ ప్రాంతీయ పార్టీలకు చీఫ్‌లే. నాడు గెలిచినప్పుడు ఈవీఎంలు బాగా పనిచేశాయని కితాబిచ్చిన నేతలు ఓటమి తర్వాత మాత్రం అవి మంచివి కావంటున్నారు. నిజానికి ఇద్దరూ తాము చేసిన స్వయంకృతాపరాధం వల్లనే ఓటమి పాలయ్యారు. అవతలి వారు గెలిచారు. అంత మాత్రాన ఎన్నికల కమిషన్ పై బురద జల్లడం ఎంత వరకూ సబబన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మాత్రం కేంద్ర ఎన్నికల కమిషన్ దే. ఎందుకంటే నెపం నెట్టింది ఈవీఎంలపైనేనా? ప్రజల దృష్టిలో దోషిగా మిగిలేది ఎన్నికల కమిషనే కావడం గమనార్హం. అందుకే ఈసీ ఈవీఎంలపై దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉంటుంది. లేకపోతే ప్రతి ఎన్నకకూ ఈవీఎం ఒక బూచిగా మారుతూనే ఉంటుంది.

## క్యాడర్‌లో కదలిక కోసం జగన్



**విజయవాడ, అక్టోబరు 11, పెన్ పవర్:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ మారిపోతున్న నేతలు ఉన్న నియోజవవర్గాల నుంచి క్యాడర్ ను పిలిపించుకుని మాట్లాడుతున్నారు. అలాగే జిల్లాలకు పార్టీ అధ్యక్షుల్ని కూడా నియమిస్తున్నారు. వీలైనంత వరకూ సీనియర్ నేతల్ని నియమిస్తున్నారు. అందర్నీ యాక్టివ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జనవరిలో నుంచి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. ఈ లోపు పార్టీ కార్యకర్తలకు, క్యాడర్ కు నమ్మకం కలిగించేందుకు గుడ్ బుక్ ప్రస్తావన తీసుకు వచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారందర్నీ గుర్తుంచుకుంటామని గుడ్ బుక్‌లో పేర్లు రాసుకుని అధికారంలోకి రాగానే మేలు చేస్తామని అంటన్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై భయపడకుండా పోరాడాలని పిలుపుస్తున్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత క్యాడర్ చాలా వరకూ సైలెంట్ అయిపోయింది. స్థానిక సంస్థల్లో ఉన్న క్యాడర్ పార్టీ మారిపోతోంది. పదవులు లేని వాళ్లు సైలెంట్ అయిపోతున్నారు. దీనికి కారణం టీడీపీని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేధించడం వల్లేనని ఇప్పుడు వారు కూడా అదేబాటలో వెళ్తే తాము తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఎక్కువ మంది ఆందోళన చెందుతున్నారు. వీరందరికీ ధైర్యం ఇచ్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే లాయర్లను అందుబాటులో పెట్టారు. ఏవైనా కేసులు అయితే తాము అండగా ఉంటామని చెబుతున్నారు. సోషల్ మీడియా కార్యకర్తలు ఇప్పటికే సైలెంట్ అయ్యారు. చాలా మందిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జగన్ అందరికీ భరోసా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆయన వెంట ఉంటూ . పదేళ్ల పాటు ఆయనతో పాటు కలిసి నడిచిన వారిని అధికారంలోకి వచ్చాక జగన్ పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. సోషల్ మీడియా కోసం పని చేసిన వారినీ పట్టించుకోలేదని చివరికి పెయిడ్ సోషల్ మీడియా పై ఆధారపడాల్సి వచ్చిందన్న అసంతృప్తి క్యాడర్ లో ఉంది. ఇక ద్వితీయ శ్రేణి నేతలు తమను జగన్ పూర్తిగా రోడ్డున పడేశారని అనుకున్నారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ తీసుకు రావడం వల్ల పాలనలో పార్టీ క్యాడర్ కు పని లేకుండా పోయిది. జగన్ కూడా వాలంటర్లకే ప్రాధాన్యం ఇచ్చారు. వారినే లీడర్లను చేస్తామని కూడా ప్రకటించారు. ఈ పరిణామాలతో గత ఎన్నికల్లో క్యాడర్ కూడా వైసీపీకి గట్టిగా పని చేయలేదన్న వాదన ఉంది. ఆ అసంతృప్తిని జగన్ గమనించారని అందుకే గుడ్ బుక్ అని చెబుతున్నారు. జగన్ బయటకు రాకుండా పార్టీ క్యాడర్ ను మాత్రమే తెరపైకి వచ్చేలా చేయడానికి ప్రయత్నిస్తే ఆ వ్యూహం ఫెయిల్ అవుతుందని జగన్ నాయకడిగా ముందుండి నడిపిస్తేనే ప్రయోజనం ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. అందుకే జగన్మోనహన్ రెడ్డి జనవరి నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటనలకు రెడీ అవుతున్నారని చెబుతున్నారు. వైసీపీ హయాంలో నారా లోకేష్, చంద్రబాబు పర్యటనల సమయంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడేవి. జగన్ పర్యటనలో అలాంటివి ఏర్పడినా జగన్ ముందుకు వెళ్తే.. ప్రభుత్వాన్ని ఎదిరించవచ్చని.. గొడవలు జరుగుతాయని అనుకుని ఆగిపోతే క్యాడర్ లో ధైర్యం రాదని చెబుతున్నారు. మొత్తంగా జగన్ పార్టీ క్యాడర్ ను యాక్టివ్ చేసేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారని అనుకోవచ్చు.

## దుర్గమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

**హైదరాబాద్ పెన్ పవర్:** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో దుర్గాదేవి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ప్రతి సంవత్సరం అమ్మవారిని ప్రతిష్ఠిస్తారు..నవరాత్రులు అమ్మవారికి ఇష్టంగా పూజలు నిర్వహిస్తారు అలాంటి అమ్మవారిపై కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసారు. అమ్మవారి విగ్రహం చెయ్యి విరగ గొట్టి అక్కడ పడేశారు... ద్వీపం ఆర్పేసి , మండపం చిందరవందర చేసారు. మండపం నిర్వాహకులు బేగం బజార్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మొదటగా కరెంట్ కటచేసి,సీసీ కెమెరాలు విరగగొట్టిన అనంతరం విగ్రహం చేతిని విరగకొట్టి,పూజ సమాన్ అంత చుట్టూ పడవేసి,అమ్మవారి చుట్టూ ఉన్న బరికేడ్స్ కూడా తొలగించిన దుండగులు ప్రతి సంవత్సరం ఎక్కడో ఒక వద్ద హిందు ఆరాధ్య విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని భక్తుల ఆవేదనతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, విగ్రహం పై దాడి చేసిన దుండగులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని పలు హిందు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు

